

కథా కౌముది

# పంకజం డి.వి.జి.శంకర్రావు

**ఆఫీసు నుండి ఇంటికి చేరాను.** పంకజం ఎదుర్రాలేదు. వాకిలి గచ్చు తడిగా ఉండటంతో అర్థమైంది. కన్నీటి ద్రవం. ఏదో ఉపద్రవం మళ్ళీ ముంచుకొచ్చినట్టుంది. జాగ్రత్తగా అడుగులు వేస్తూ పడకగదిలోకి వెళ్ళాను. మధ్యలో రెండుసార్లు ధబీమని కాలు జారిపడ్డాను. కానీ అంత ముఖ్యం కాదుకదా అని మీకు చెప్పటం లేదు.

పడక గదిలో పంకజం కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. నన్ను చూసి 'ఏమండీ' అంటూ కళ్ళు తుడుచుకుంది.

"పంకజం ఒకసారి నువ్వు చీర మార్చిస్తే ఆ చీర, దుప్పటి, టవళ్ళు మేడమీద ఆరేసి వస్తాను. బాగా తడిచిన వాటితో ఎక్కువసేపుంటే జలుబు చేస్తుంది" లాలనగా అన్నాను.

"మీ తొందర మీదే. ఏమైందని అడగడం మాని చీర పిండి ఆరెయ్యడానికి పరుగెడ్తున్నారు" అంటూ భళ్ళున ముక్కింది.

"అయ్యో! నా మతిమండ. ఎంతసేపూ పనిధ్యాసే. ఇప్పుడడుగుతున్నాను. ఏమైంది బంగారం? ఈ రోజు సీరియల్‌లో కోడలు పిల్లకు దెబ్బ తగిలిందా? బంగారం రేటు మనం కొనడంలేదని తెలిసి తగ్గిపోయిందా?"

"ఏడ్చినట్టుంది. ఇంతకాలమైనా భార్య మనసు అర్థం చేసుకోవడం చాతకాదు మీకు. ఇదుగో ఈ పేపరు చూడండి" పేపర్ నా మొహాన కొట్టింది.

పేపర్ తెరిచి అందులో బికినీ డ్రస్‌లో ఉన్న హీరోయిన్‌ని చూస్తూ చొంగ కారుస్తున్నాను. అలా ఎంతసేపు చూస్తుండిపోయానో తెలియదు. పంకజం హుంకరింపుతో ఈ లోకంలోకి వచ్చాను.

"ఆ పేజీ కాదు. పక్కపేజీ చూడండి."

ఆ పేజీలో బాక్స్ కట్టి ప్రచురించబడి ఉంది. "ఈసారి మాయా లాటరీ బంపర్ ప్రయిజ్ విన్నర్ కె. స్వరాజ్యం. చంద్రమండలంపై ప్లాటు గెల్చుకున్నారు."

అది చదివి నేనూ 'కెవ్వు'మన్నాను.

"చూశారా. మీరే 'కెవ్వు'మంటే మరి నేనేమవ్వాలి? దాని స్వంత చెల్లెల్ని"

పంకజం బాధ అర్థమైంది..

"నిజమే బంగారం. స్వంతవాళ్ళు బాగుపడడంకన్నా బాధ కలిగించే అంశం ఏముంటుంది? అయినా మనకే ఇలా అవ్వాలా? ఆ దేవుడు పగబట్టాడు.. పగ బట్టాడు" నాకు తెలీకుండానే నా గొంతు బొంగురుపోయింది.

❦❦❦

పంకజం అక్క స్వరాజ్యం. ఇద్దరూ ఆదర్శవంతమైన అక్కచెల్లెళ్ళు. పెళ్ళిళ్ళు అయ్యేవరకూ ఒకర్ని విడిచి ఒకరున్నదే లేదట. అక్కకు పెళ్ళవ్వగానే తనకూ అంతకుమించిన బకరాని తెచ్చి, అంతకన్నా ఎక్కువ కట్నమిచ్చి పెళ్ళిచెయ్యాల్సిందేనంటూ మొండిపట్టు పట్టిందట పంకజం.

'బకరానైతే తీసుకురాగలం గానీ కట్నం అంత ఇచ్చుకోలేం' అని వాళ్ళ నాన్నంటే అప్పుడూ ఇలానే కన్నీరు మున్నీరైందంట.

అదుగో అలా జరిగింది మా పెళ్ళి. ఆ వరదల బురద ఎండకముందే మా పెళ్ళి తాంబూలం పండింది.

❦❦❦

స్వరాజ్యానికి లాటరీ తగలడం నాకూ కడుపుమంటే జేబులో రెడీగా ఉంచే 'కడుపు మంటకి మాత్ర' తీసి గుటుక్కున మింగాను. నీళ్ళు అందుబాటులో లేక వెక్కిళ్ళు వచ్చాయి.

'అలా ఆపసోపాలు పడడం బదులు కొంచెం కన్నీళ్ళు పెట్టుకోరాదూ' గదమాయించింది.

'టీవీ కొన్నరోజూ ఇదే వరస. పాడు సంత' గొణుక్కుంది.

ఒక్కసారి వెక్కిళ్ళతోపాటు గతం ఠక్కున గుర్తుకొచ్చింది.

❦❦❦

ఆరోజు స్వరాజ్యం ఇంటికి చుట్టం చూపుకెళ్ళాం. అక్కా చెల్లెళ్ళిద్దరూ గాఢంగా కౌగలించుకున్నారు. తోడళ్ళుళ్ళం కూడా టీవీ సీరియల్ అభిమానాల్ని ఒలకబోశాం. అసలు విడివిడిగా ఎలా బ్రతకగలుగుతున్నాం అంటూ బోలెడు ఆశ్చర్యపోయాం. భోజనాలు ముగించిన పిమ్మట వీడలేక వీడలేక విడిపోతూ బై బై చెప్పుకున్నాం. పంకజం, నేనూ బైకు ఎక్కామో, లేదో స్వరాజ్యం, వాళ్ళాయన ఢదేలున తలుపు మూశారు. ఆ వీధి చివర దాటామొ లేదో పంకజం అందుకుంది "చూడండీ దాని మిడిసిపాటు. నేను చూడాలని తన నగలన్నీ దిగేసుకుంది. లేకపోతే ఎవరైనా మూడేసి హారాలు ఒకేసారి వేసుకుంటారా?"

"అవునోయ్. వాళ్ళాయన చూశావా? ఇప్పుడే వస్తానంటూ లోనికి వెళ్ళి నాలుగు ఉంగరాలు తగిలించుకొచ్చాడు. వాళ్ళ మాడ్యులర్ కిచెన్ ఎలా డిజైన్ చేసిందీ వండుతున్నంతసేపూ చెపుతూనే ఉన్నాడు."

మా కబుర్లు వాళ్ళని దాటలేదు. ఇంకా సగంలో ఉండగానే 50 కిలోమీటర్లు దాటి ఇంటికొచ్చేశాం. తనని దించేసి అలా ఆఫీసుకి వెళ్ళాను. తిరిగొచ్చే వేళకు వీధి అంతా ఇంకుడు గుంతలు తవ్వుతున్నారు. అటూ, ఇటూ నీటికాలువలు పొంగిపొర్లుతున్నాయి.

'వర్షం లేదు. వారం రోజులుగా మంచి నీళ్ళులేవు. అకాలంగా అబ్బో ఎంత నీరో అనుకుంటూ అబ్బురంగా ఇల్లు చేరాను. అవి మా ఇంట్లోంచే వస్తున్నాయి. అలా బోలెడు హాశ్చర్య పడిపోతూ మధ్య మధ్యన కాలు జారిపడిలేస్తూ పడకగదికి వెళ్ళాను. అక్కడ చూశాను పంకజాన్ని. కొలను మధ్యన నిల్చున్న పంకజంలా. రెండుకళ్ళనుండి నయాగరాలు. చుట్టూ తడిసి ముద్దయిన బట్టలూ, పుస్తకాలూ.

"ఏమైంది బంగారం?"

"స్వరాజ్యం ఇంటినుండి వచ్చాక మన వస్తువులన్నీ ఈ స్కేలుతో కొలుస్తున్నానండీ. అన్నీ వాళ్ళ వస్తువుల కొలతలకు సరిపోయాయి. ఇదుగో ఈ టీవీ మాత్రం వాళ్ళ టీవీకన్నా చిన్నగా ఉందండి. నాకెలా ఉంటుంది చెప్పండి?" గద్దించింది.

ఛెంగున దూకి స్కేలందుకున్నాను. ఎలా ఎటు తిప్పి కొలిచినా చిన్నదిగానే ఉంది.

అప్పుడు మొదలైంది కడుపుమంట. విలవిల్లాడాను.

"నిజమే బంగారం. లక్ష మందికి లక్ష పెద్ద టీవీలుంటే మనకెందుకు? కోటి మందికి కోట్ల రూపాయలుంటే మనకెందుకు? మన దగ్గరివాళ్ళకు మనకన్నా పెద్ద టీవీ ఉంటే నిద్రెలా పడ్తుంది? రేపే మార్కెట్‌కి వెళ్ళి కొనుక్కో. నా క్రెడిట్ కార్డు తీసుకెళ్ళు."

పరిష్కారం చెప్పేసి తడిచిన బట్టలు ఆరేసాను.

మర్నాడు సాయంత్రం ఇంటికొచ్చేసరికి తలుపులేదు. తలుపు పక్క గోడకూడా కొంతకొట్టేసి ఉంది. బెరుగ్గా ఇంట్లో అడుగుపెట్టేసరికి పంకజం ముఖమంతా వెలిగిపోతోంది. నవ్వుతూ కూల్‌డ్రింకు చేతిలో పెట్టి పడగ్గదిలోకి తీసుకెళ్ళింది. పడగ్గది నిండా పెద్దటీవి. దానికి స్థానం చాలదని మంచం బయటపడేసింది.

"ఇప్పుడు చెప్పండి. టీవీ బాగుంది కదూ! స్వరాజ్యం వాళ్ళ టీవీకి డబుల్ ఉంటుంది కదూ"

"ఎందుకుండదోయ్. అద్భుతంగా ఉంటేనూ. మన తలుపుకేమైంది? గోడ కొట్టేశారేం?"

"మీ బుర్ర షెర్లాక్స్ హోమ్స్ ఎత్తుకెళ్ళా. ఆమాత్రం ఆలోచించలేరా? ఆ చిన్న ద్వారంలోంచి ఇంత టీవీ ఎలా వస్తుందనుకున్నారు? అందుకనే కొట్టించేశా."

"ఓ అదా! తట్టనేలేదు" భుజం తట్టి అభినందించాను.

ఆ వెంటనే స్ఫురించింది. అవునూ వాళ్ళ టీవీ ఈజీగా ఇంట్లో పెట్టారంటే వాళ్ళ తలుపులు మాకన్నా పెద్దవే అయ్యుండాలి కదా! ఓ వైపు కడుపుమంట రెండోవైపు నీటి కరువు. వెరసి వెక్కిళ్ళు. వాటి ట్రీట్‌మెంటు కోసం మళ్ళీ పరుగుపెట్టాను క్రెడిట్ కార్డు పట్టుకుని. అదీ అప్పటి సంగతి.

నిద్రలోనే పంకజం దేవుణ్ణి మొక్కేస్తూ కలవరిస్తోంది ఈ గండం గట్టెక్కించమంటూ. నాకు మెలుకువ కన్నా ముందే వెక్కిళ్ళు వచ్చి వెక్కిరిస్తున్నాయి. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. ఉదయాన్నే ఒక చేతిలో పేపరు, మరో చేతితో కొరడా పట్టుకుని నన్ను లేపింది.

"అర్జెంటుగా చూడండీ పేపరు. నిన్నటిది తప్పు వార్తట. సవరణ రాశారు. వేరే ఊరిలో ఉన్న వేరే స్వరాజ్యందట బంపర్ గెలుపు. హెంత ఆనందంగా ఉందో."

"గుడ్ న్యూస్. ఆవిడెవరు?"

"ఏమో? నాకేం తెలుసు? ఎవరికైనా మంచి జరిగితే మనం సంతోషించాలిగా" ప్రేమగా నా నెత్తిమీద మొట్టింది.

"ఔనౌను" లేచిన బొప్పిని తడుముకుంటూ వంతపాడాను. అన్నట్టు వెక్కిళ్ళు కూడా ఆగిపోయాయి.

**Click here to share your comments on this story**